సాక్షి
అనంతపురం

బుధవారం। 14। ఆగస్టు। 2024



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.1°/23.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు 'ఎల్లో' అలర్ట్



అనంతపురం అగ్రికల్చర్: భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం జిల్లాకు 'ఎల్లో అలర్ట్' ప్రకటించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణ స్వామి మంగళవారం తెలిపారు. అల్పపీడన ద్రోణి కారణంగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. మంగళవారం జిల్లాలోని కొన్ని మండలాల్లో తేలికపాటి వర్షం కురిసిందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో మోస్తరుగా వర్షాలు కురిశాయన్నారు. బుధ, గురువారంతో పాటు ఈనెల 16వ తేదీ కూడా జిల్లాకు వర్షసూచన ఉందన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కొన్ని మండలాల్లో భారీ వర్షపాతం నమోదు కావచ్చన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచన ఉందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 34.2 డిగ్రీల నుంచి 35.6 డిగ్రీలు, కనిష్టం 26.3 డిగ్రీల నుంచి 27.2 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని తెలిపారు. గాలిలో తేమశాతం ఉదయం 78 నుంచి 86, మధ్యాహ్నం 65 నుంచి 78 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. వాయువ్య దిశగా గంటలకు 6 నుంచి 7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు.

'వైద్య కళాశాల' బృందం పెద్దమనసు
- కేరళ వరద బాధితులకు రూ.4 లక్షల ఆర్థిక సాయం



మంత్రి సత్యకుమార్‌కు చెక్కు అందజేస్తున్న కళాశాల ఉన్నతాధికారులు

అనంతపురం మెడికల్: వైద్య కళాశాల అధ్యాపక బృందం, వైద్యులు, పీజీ విద్యార్థులు పెద్దమనసు చాటుకున్నారు. కేరళ వరద బాధితులకు రూ.4,08,602 ఆర్థిక సాయం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును మంగళవారం విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ వరద బీభత్సంతో కేరళలోని వయనాడ్‌లో సుమారు 380 మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధితుల సహాయార్థం వైద్య కళాశాలలో విరాళాలు సేకరించామన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రూ. 4 లక్షలకు పైగా అందించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు కూడా సాయం చేసి వరద బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- డీటీసీ వీర్రాజు హెచ్చరిక



బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్: విద్యార్థులను తరలించే స్కూల్స్, కళాశాలల బస్సులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) వీర్రాజు హెచ్చరించారు. మంగళవారం నగరంలో రవాణా శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 186 బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీసీ వీర్రాజు మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని నాలుగు వాహనాలు, ఇన్సూరెన్స్ లేనివి ఆరు, పన్ను కట్టనివి మూడు, పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న 10, ఇతర అంశాల్లో 4 మొత్తం 38 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. 6 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు తదితరులు పాల్గొన్నారు.

- అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పరిధిలోని సీయోన్ పురం ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని గతంలో ఒక ఉర్దూ పోస్టును ఇచ్చారు. ప్రస్తుతం ఆ పోస్టును ఎస్జీటీగా కనబరిచి మిగులుగా చూపించారు. దీంతో ఆ టీచరు బయటకు వెళ్లనున్నారు. ఈ క్రమంలో అక్కడి విద్యార్థుల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.
- గార్లదిన్నె మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 17 సెక్షన్లు ఉన్నాయి. ఫిజిక్స్ మూడు, హిందీ రెండు పోస్టులు ఉన్నాయి. అయితే ఇక్కడ ఫిజిక్స్, హిందీ ఒక్కో పోస్టును సర్‌ప్లస్‌గా చూపించారు. విద్యాశాఖ అధికారులను అడిగితే తమ పరిధిలో లేదని చేతులెత్తేస్తున్నారు.
- అనంతపురం నగరంలోని సాయిబాబా నగరపాలక ప్రాథమిక పాఠశాలలో 2006 డీఎస్సీలో ఓ టీచరు చేరారు. 2007లో జరిగిన అంతర్ జిల్లాల బదిలీల్లో బయట జిల్లా నుంచి మరో టీచరు ఈ స్కూల్‌కు వచ్చారు. తాజా సీనియార్టీ జాబితాలో అంతర్ జిల్లా బదిలీల్లో వచ్చిన టీచరును సీనియర్‌గా చూపించారు.



టీచర్లకు సర్దుపోటు.. యువతకు వెన్నుపోటు!

- జిల్లాలో 1,140 మంది టీచర్లు మిగులుగా ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ
- వీరిలో 750 మందికి పైగా సెకండరీ గ్రేడ్ టీచర్లే
- ప్రత్యేక కేటగిరీ టీచర్లనూ సర్దుబాటు చేస్తున్న వైనం
- అసంబద్ధ నిర్ణయాలపై ఉపాధ్యాయ సంఘాల గుర్రు
- మిగులు టీచర్ల సంఖ్యపై నిరుద్యోగుల ఆందోళన
- ఇంతమంది మిగులుగా ఉంటే మెగా డీఎస్సీ ఎలా ఉంటుందని ప్రశ్న

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో 'మిగులు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ' గందరగోళంగా మారింది. భయభ్రాంతులకు గురైన టీచర్లు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలియజేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,140 మంది టీచర్లు 'మిగులు'గా చూపించడం యువతను ఆందోళనకు గురి చేస్తోంది. వీరిలో ఎస్జీటీలే 750 మందికి పైగా ఉన్నారు. ఇంతమంది టీచర్లు మిగులుగా ఉంటే రానున్న రోజుల్లో మెగా డీఎస్సీకి ఖాళీలు ఎన్ని చూపిస్తారంటూ ఉపాధ్యాయులు, నిరుద్యోగ అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇవే విధానాలు అనుసరిస్తే ఒక్కో కేటగిరీలో పదుల సంఖ్యలో మాత్రమే పోస్టులుంటాయని, మరికొన్ని కేటగిరీల్లో అసలు పోస్టులే ఉండవని చెబుతున్నారు.

గాయం ఒకచోట.. మందు మరోచోట..

'గాయం ఒక చోట తగిలితే మందు మరోచోట పూసిన' చందంగా ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చేపడుతోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. గతంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, తెలుగు, సోషల్ పోస్టులు ఇచ్చారు. వీరితో పాటు డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులను ఎంటీఎస్ టీచర్లుగా తీసుకుని సేవలు పొందుతున్నారు. మైనారిటీ విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట్ల ఉర్దూ విద్యను పెంచడం కోసం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ పోస్టులను సృష్టించారు. అవన్నీ ఈరోజు మిగులు టీచర్లుగా చూపిస్తున్నారు. వాస్తవానికి టీచర్ల సర్దుబాటు చేయాల్సిన స్థానాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయినా, సర్‌ప్లస్ పేరుతో వేలాదిమందిని మిగులుగా చూపించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

గతంలో మండలస్థాయిలోనే సర్దుబాటు

ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత మిగులుగా ఉన్న టీచర్లను మండలస్థాయిలోనే సర్దుబాటు చేసేవారు. స్కూల్ అసిస్టెంట్లను డీవైఈఓ స్థాయిలో చేసేవారు. ఈ సారి మాత్రం రాష్ట్ర స్థాయిలో ప్రక్రియను చేపడుతుండడం గమనార్హం. ఎంఈఓలు, డీవైఈఓలకు వారి పరిధిలో పరిస్థితులపై అవగాహన ఉంటుంది. కానీ, అవేవీ తెలీని రాష్ట్ర అధికారులు సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం సమస్యలకు దారి తీస్తోంది.

ఆ స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు గోవిందా?

3–8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 మంది వరకు విద్యార్థులుంటే స్కూల్ అసిస్టెంట్లను తీసేస్తున్నారు. 1:30 రేషియోలో ముగ్గురు ఎస్జీటీలను ఉంచుతున్నారు. అదే 98 మంది పైన విద్యార్థులుంటే ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లను పెడుతున్నారు. 98 మంది లోపు ఉన్న స్కూళ్లల్లో సబ్జెక్టు టీచర్లు అవసరం లేదా? ఇదెక్కడి శాస్త్రీయత అని టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి, జంతులూరు, చెన్నంపల్లి తదితర యూపీ స్కూళ్లలో అసిస్టెంట్ పోస్టులు పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి చాలా ఉన్నాయి.

నమ్మించి.. వంచించి

గత ఎన్నికల ముందు 'యువగళం పాదయాత్ర' చేపట్టిన నారా లోకేష్ న్యాయం చేస్తామంటూ ఉపాధ్యాయ సంఘాలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కూడా ఇవే పలుకులు పలికించి తమ ఓట్లు దండుకున్నారని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఈ రోజు కుంటిసాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

సర్దుబాటు జరుగుతున్న మొత్తం స్కూళ్లు	1,644
ప్రాథమిక పాఠశాలలు	1,188
ప్రాథమికోన్నత పాఠశాలలు	184
ఉన్నత పాఠశాలలు	272
ప్రాథమికంగా గుర్తించిన మిగులు టీచర్లు	1,140

అశాస్త్రీయం, అసంబద్ధం



టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చాలా అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉంది. ఈ విధానం వల్ల వేలాది ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోనున్నాయి. ప్రీ హైస్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయడం వల్ల 3–4 టీచర్లపై ప్రభావం పడుతుంది. ఎనిమిది తరగతులకు తరగతికి ఒక ఉపాధ్యాయుడు కూడా లేని పరిస్థితి ఏర్పడుతుంది.
– సి.లింగమయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

మాట నిలబెట్టుకోవాలి



ప్రభుత్వం చేపడుతున్న మిగులు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ టీచర్లను తీవ్ర గందరగోళానికి గురి చేస్తోంది. పని సర్దుబాటు అనేది మండల స్థాయిలోనే జరగాలి. రాష్ట్రస్థాయిలో చేస్తుండడం తీవ్ర తప్పిదాలకు దారి తీస్తోంది. పదోన్నతుల తర్వాతే పని సర్దుబాటు జరగాలి. ఎన్నికల ముందు చెప్పిన విధంగా 117 జీఓ రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలి.
– సిద్ధం రామాంజనేయులు, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి

డీఎస్సీకి అవకాశం ఉండదు



ఇన్ని పోస్టులు సర్‌ప్లస్‌గా చూపిస్తే డీఎస్సీకి అవకాశం ఉండదు. రానున్న మూడేళ్ల వరకూ ఇక మెగా డీఎస్సీ ఎక్కడుంటుంది! గతంలో చేపట్టిన 53 జీఓను అనుసరించే టీచర్లను సర్దుబాటు చేయాలి. రాష్ట్రస్థాయిలో కాకుండా మండల యూనిట్‌గా తీసుకోవాలి. ఉన్నత పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని స్కూళ్లకు టీచర్లను కేటాయించేలా చూడాలి.
– పోచంరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రస్థాయిలో చేయడం సరికాదు



టీచర్ల సర్దుబాటును రాష్ట్ర కార్యాలయం నుంచి చేపట్టడం సహేతుకం కాదు. ఇది ఒక విద్యా సంవత్సరానికి సంబంధించింది. మండల, జిల్లా స్థాయిలో జరిగితేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. రాష్ట్ర స్థాయి నుంచి వచ్చే లిస్ట్‌పై అనేక అనుమానాలు నెలకొన్నాయి.
– ఉదయగిరి మహమ్మద్ రఫీక్, రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీఎఫ్ 1938

సర్దుబాటు ప్రక్రియ ఆపేయాలి



రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధంగా చేపడుతున్న టీచర్ల సర్దుబాటును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ఈ సర్దుబాట్లను వెంటనే ఆపేయాలి. 117 జీఓ రద్దు తర్వాతనే సర్దుబాటు జరపాలి. అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలి. అలా కాకుండా అసంబద్ధ నిర్ణయాలతో ముందుకెళ్తే ఉద్యమించక తప్పదు.
– కరణం హరికృష్ణ, ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

క్షమాభిక్ష కరువై.. శిక్షతో శిథిలమై

- ఖైదీల విడుదలపై నోరుమెదపని కూటమి సర్కారు
- ఆవేదనలో కూరుకుపోతున్న బాధితులు
- మానవత్వంతో గత ప్రభుత్వం చర్యలు
- 14 మందికి సాంత్వన



రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం ఖైదీల పట్ల చిన్నచూపు చూస్తోంది. ఖైదీలకు సంబంధించి క్షమాభిక్ష జీఓ విడుదల చేయడంలో నిర్లక్ష్యం చూపుతుండటమే ఇందుకు నిదర్శనం. సత్ప్రవర్తనతో మెలిగే జీవిత ఖైదీలను రిపబ్లిక్ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి రోజున క్షమాభిక్ష ద్వారా బయటకు పంపేవారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022 ఆగస్టు 15న జీవిత ఖైదీల క్షమాభిక్షకు సంబంధించి జీఓ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది జీవిత ఖైదీలు విడుదల కాగా, మండలంలోని రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలు నుంచి 14 మందిని విడుదల చేశారు. ఖైదీలతో పాటు వారి కుటుంబీకులకు ఎంతో సాంత్వన చేకూర్చారు.

స్పందించని కూటమి ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం మాత్రం ఖైదీల విడుదలను పట్టించుకోవడం లేదు. మండలంలోని రెడ్డిపల్లి ఓపెన్ ఎయిర్ జైలులో ప్రస్తుతం 36 మంది ఖైదీలుండగా, 10 సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్న వారు 17 మంది దాకా ఉన్నారు. పెద్ద మనసుతో ఇలాంటి వారికి క్షమాభిక్ష ప్రసాదించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

శుభవార్త కోసం కళ్లు కాయలుకాసేలా..

క్షణికావేశంలో చేసిన తప్పునకు ఎంతో మంది ఖైదీలు జైళ్లలో కఠిన కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. తల్లిదండ్రులు, భార్యాబిడ్డలకు దూరమై మానసికంగా కుంగిపోతున్నారు. చేసిన తప్పునకు ప్రాయశ్చితంగా ఇన్నాళ్లూ జైల్లో సత్ప్రవర్తనతో మెలిగారు. క్షమాభిక్ష జీఓ కోసం రాత్రింబవళ్లు ఎదురు చూస్తున్నారు. స్వేచ్ఛా ప్రపంచంలోకి వెళ్లి తల్లిదండ్రులు, భార్యాబిడ్డలతో కలసి జీవించాలని ఆశిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎప్పుడు మంచి వార్త వింటామా? అని కళ్లలో ఒత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఖైదీల విడుదలపై ఇంకా ఫైలు పరిశీలించాల్సి ఉందని కుంటి సాకులు చెబుతుండడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఓపెన్ ఎయిర్ జైలు అధికారులను సంప్రదించగా, జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీల జాబితాను ఇప్పటికే జైళ్ల శాఖ డీఐజీ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ప్రభుత్వమే తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

80 శాతం రాయితీతో 'ప్రత్యామ్నాయం'

- విత్తన పంపిణీకి ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో 27,907 క్వింటాళ్లకు అనుమతి



ఉలవ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలంటూ వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లావ్యాప్తంగా వర్షాభావంతో ప్రధాన పంటల సాగు తగ్గిపోయిన నేపథ్యంలో 80 శాతం రాయితీతో ఏపీ సీడ్స్ ద్వారా ప్రత్యామ్నాయ విత్తనాలు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాకు 27,907 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 18,265 క్వింటాళ్ల పంపిణీకి అనుమతులు ఇచ్చారు. జిల్లా పరిధిలో నాలుగు కంపెనీలకు చెందిన 21,791 క్వింటాళ్ల ఉలవలు, మూడు కంపెనీలకు చెందిన 1,501 క్వింటాళ్ల పెసలు, అలసందలు 3,253 క్వింటాళ్లు, ఐదు కంపెనీలకు చెందిన 973 క్వింటాళ్ల జొన్నలతో పాటు 369 క్వింటాళ్ల కొర్రలు, 20 క్వింటాళ్ల మినుము విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 15,221 క్వింటాళ్ల ఉలవలు, 2,099 క్వింటాళ్ల పెసలు, 720 క్వింటాళ్ల అలసంద, 225 క్వింటాళ్ల జొన్నల పంపిణీకి అనుమతులిచ్చారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట సాగు చేసినట్లు ఈ-క్రాప్ నమోదు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల వేదికగా డీ-కృషి యాప్ ద్వారా ఒక్కో రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్లకు విత్తనాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లో విత్తనాలకు సంబంధించి ధరలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిసింది.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు

- భూ సమస్య తీరలేదని మనస్తాపం



చెన్నేకొత్తపల్లిలో సెల్ టవర్ ఎక్కి చివరి భాగంలో ఉన్న వ్యక్తి

చెన్నేకొత్తపల్లి: ఆస్తి విషయంలో అధికారులు తనకు న్యాయం చేయడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మూడు గంటల పాటు అందరినీ ముప్పుతిప్పలు పెట్టాడు. వివరాల్లోకి వెళితే.. పులేటిపల్లి పంచాయతీ కోటంపల్లి గ్రామానికి చెందిన మహేంద్రకు తన తాతల నాటి భూమి 3.80 ఎకరాలు రావాల్సి ఉంది. అయితే ఈ భూమిని తన చిన్నాన్నలు తీసుకున్నారు. ఈ విషయంపై పలుమార్లు వారితో చర్చించినా ఫలితం లేకపోయింది. న్యాయం కోసం మహేంద్ర అధికారులను ఆశ్రయించినా పరిష్కారం లభించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన మహేంద్ర మంగళవారం చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్‌ను ఎక్కాడు. గమనించిన ఎస్ఐ వెంకటేశ్వర్లు, సీఐ శివాంజనేయులు, ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులుకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు మహేంద్రకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. మరోవైపు విషయం తెలుసుకున్న మహేంద్ర తల్లి, భార్య, కుమారుడు, కుటుంబ సభ్యులు టవర్ వద్దకు చేరుకుని కిందకు దిగిరావాలని బతిమాలారు. అయినా ఫలితం లేకపోయింది. తనకు ఇప్పటికిప్పుడు న్యాయం జరగాలని, కాదని ఎవరైనా సెల్ టవర్‌పైకి రావాలని చూస్తే దూకేస్తానంటూ మూడు గంటలు ముప్పుతిప్పలు పెట్టాడు. చివరకు పోలీసులు మహేంద్ర చిన్నాన్నను పిలిపించారు. సమస్యను పరిష్కరించుకుందామని ఆయన ద్వారానే చెప్పించారు. దీంతో రాత్రి 7.45 గంటలకు మహేంద్ర సెల్‌టవర్ నుంచి కిందికి దిగాడు. కుటుంబీకులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

'రాష్ట్రాన్ని వీడని విభజన కష్టాలు'



మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్ : రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ చాలా ఇబ్బందుల్లో ఉందని మాజీ సీఎం, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అనంతపురం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల నిధులు ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్రం సహకారం ఉందన్నారు. రాష్ట్ర విభజన తరువాత కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తే చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయే అవకాశం ఉందని చెప్పారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, నాయకులు లలిత్ కుమార్, చిరంజీవిరెడ్డి, దేవిరెడ్డి లక్ష్మిదేవి, సాకే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లన్నీ తుంగభద్ర డ్యాంపైనే..



టీబీ డ్యాం 19వ క్రస్ట్ గేటు నుంచి వృథాగా పోతున్న నీరు

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం 19వ గేటు అమర్చేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జలాశయంలో నీరు తగ్గిన తర్వాతే పనులు మొదలు పెట్టాల్సి ఉంది. కానీ, కళ్లెదుటే నీరు సముద్రం పాలవుతుండడంతో ఎలాగైనా అడ్డుకట్ట వేసి ఆయకట్టుకు ఇవ్వాలని భావిస్తున్నారు. మంగళవారం తుంగభద్ర బోర్డు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాల ఇంజినీరింగ్ అధికారులు అత్యవసర సమావేశం నిర్వహించారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి గేటు అమర్చవచ్చా అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. మానవ ప్రయత్నంలో భాగంగా బుధవారం పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు మూడు ప్రైవేటు కంపెనీల సహకారం తీసుకుంటున్నారు. గేటు పునరుద్ధరణ పనులు విజయవంతమైతే ఈ ఏడాది ఆయకట్టు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో అధికారుల ప్రయత్నాలు ఫలించాలని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం



మృతుడు పవన్‌కుమార్

కంబదూరు: స్థానిక గుండ్లపల్లి కాలనీలో నివాసముంటున్న రామలక్ష్మి కుమారుడు పవన్‌కుమార్ (31) ఆత్మహత్య చేసుకున్నాడు. రామలక్ష్మికి ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీనికి తోడు ఐదు రోజుల క్రితం అక్క గౌతమి బెంగళూరులో ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్న పవన్ కుమార్ మంగళవారం ఉదయం కడుపు నొప్పి తాళలేక జీవితంపై విరక్తితో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో భర్తకు జైలు

అనంతపురం సెంట్రల్: భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ అడిషనల్ సెషన్స్ కోర్టు (పీఏఎస్) జడ్జి శంకరరావు తీర్పు వెలువరించారు. 2019, జూలై 22న అనంతపురంలోని ఆదర్శ నగర్‌లో నివాసముంటున్న సువర్ణబాయిపై భర్త శ్రావణ్‌కుమార్ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసిన సీఐ జాకీర్ హుస్సేన్ పక్కా ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి కేసు వాదనలు కొనసాగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో శ్రావణ్ కుమార్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను పీపీ ఎంవీ రమణారెడ్డి వినిపించారు.

'విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తరాదు'

అనంతపురం రూరల్: గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదని వార్డెన్లకు గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో వార్డెన్లు, రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి వసతి గృహంలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వాచ్‌మెన్లు సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆ రంగుల్లో ఓ అందం ఉంది. ఆకర్షణ ఉంది. అంతకుమించి ఓ జాతి అస్తిత్వం, ఐకమత్యం, ధర్మం దాగి ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే భరత జాతి ఆశలు... ఆశయాల్నీ ప్రతిబింబించే ప్రకాశవంతమైన వర్ణాలివి. అవే జాతీయ పతాకంలోని కాషాయం.. తెలుపు... ఆకుపచ్చ వర్ణాలు. ఈ మూడు వర్ణాల్లో మానవ ధర్మాన్ని ప్రబోధించే అశోకుడి ధర్మచక్రం నీలిరంగులో మెరిసిపోతూ నిజాయితీకి ప్రతీకగా నిలుస్తోంది. తిరుగులేని దేశభక్తే తమ ఆయుధంగా పోరాటం సల్పి భరతమాతను దాస్య విముక్తి కల్గించిన వారిలో అనంత వాసులూ ఎందరో ఉన్నారు. వారి స్ఫూర్తిదాయకమైన పోరాటాల ఫలితంగా... నాటి నుంచి నేటి వరకూ వన్నె తగ్గని జాతీయ పతాకం రెపరెపలాడుతోంది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారతావని స్వేచ్ఛకు ప్రతిరూపాలుగా నిలిచిన మహనీయులు... స్మారకాల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.. – అనంతపురం కల్చరల్




తిరంగా.. మురవంగా

అమరుల స్మారకం



అనంతపురం నగర నడిబొడ్డున నిలువెత్తు రూపంలో కనిపించే టవర్ క్లాక్ స్వాతంత్ర్య సంగ్రామంలో అమరుల జ్ఞాపకార్థం నిర్మించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటికి గుర్తుగా 8 (ఆగస్టు నెల) భుజాలు, 15 (తేదీ) అడుగుల వెడల్పు, 47 (1947) అడుగుల ఎత్తుతో టవర్‌క్లాక్‌ను నిర్మించారు. 1952లో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన సతీమణి కమలానెహ్రూతో కలసి దీనిని ప్రారంభించారు. ఒకనాడు శ్వేత సౌధంలా మెరిసిపోయిన ఈ స్మారక చిహ్నం మారుతున్న కాలానుగుణంగా రంగులనూ సంతరించుకుంది.

జాతీయోద్యమంలో కల్లూరు మార్క్



లలిత కళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన కల్లూరు సుబ్బారావు విగ్రహం

అనంత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కల్లూరు సుబ్బారావు ప్రత్యేక భూమికను పోషించారు. 1918లో గాంధీజీ పర్యటనలో ఇచ్చిన ఉపన్యాసానికి ప్రభావితం ఆయన... మెట్రిక్యులేషన్‌తో చదువుకు స్వస్తి పలికి జాతీయోద్యమంలో ప్రవేశించారు. జాతీయ స్థాయిలో జరిగిన అనేక సమావేశాలకు రాయలసీమ తరఫున హాజరైన ఏకైక ప్రతినిధిగా ఖ్యాతిగాంచారు. రాయలసీమ ప్రజా ప్రయోజనాల కోసం శ్రీబాగ్ ఒడంబడికలో సంతకం చేసిన వారిలో ముఖ్యులు. స్వాతంత్ర్యానంతరం శాసనసభకు ఎన్నికై, 1955లో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయనను గుర్తించి అనంతపురం నగరంలో ప్రభుత్వం ఇచ్చిన విలువైన స్థలాన్ని లలిత కళలను ప్రోత్సహించేందుకు ఉదారంగా అందజేసి అపరదానకర్ణుడిగా వాసికెక్కారు. ప్రస్తుతం రూ.కోట్ల విలువ చేసే ఆ స్థలంలో నిర్మించిన లలిత కళా పరిషత్ వేదిక ఎంతో మంది కళాకారులకు ఊతమిస్తోంది.

చిరస్మరణీయుడు యర్రమల



దేశం పట్ల అచంచల భక్తివిశ్వాసాలున్న యర్రమల కొండప్ప త్యాగం చిరస్మరణీయం. 1890లో ఓ గొప్ప భూస్వామ్య కుటుంబంలో జన్మించి, విద్యావంతుడై పోలీసు శాఖలో పనిచేశారు. ఆ రోజుల్లోనే గుంతకల్లు సభలో బాలగంగాధర్ తిలక్ ఉపన్యాసంతో ప్రభావితుడైన ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొంటూ వచ్చారు. ఈ క్రమంలో 1921లో బ్రిటీష్ సైనికులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించారు. 1934లో మహాత్మాగాంధీ అనంతకు విచ్చేసిన సమయంలో హరిజనోద్ధరణ పిలుపునకు ప్రభావితుడై అదే స్ఫూర్తితో అనంతపురంలోని అశోక్ నగర్‌లో ఎంతో విలువైన రెండు ఎకరాల భూమిని ధారాదత్తం చేశారు. ఆ స్థలంలోనే ప్రస్తుతం అంబేడ్కర్ భవనం నడుస్తోంది. అదే ప్రాంగణంలో ఆయన నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక్కడ నాడు ఏర్పాటు చేసిన హరిజన వసతి గృహంలోనే మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆశ్రయం పొంది చదువుకున్నారు.

ఆకట్టుకున్న ర్యాలీ



త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయదుర్గం టౌన్: అజాదీ కా అమృత్ మహోత్సవ్..హర్ ఘర్ తిరంగాలో భాగంగా దేశభక్తి ఉప్పొంగేలా రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 300 అడుగుల భారీ త్రివర్ణ పతాకాన్ని ఊరేగించారు. మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ ఆధ్వర్యంలో కళాశాల నుంచి వినాయక సర్కిల్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ఐక్యతను చాటారు.

తెల్లదొరలకు సింహస్వప్నమైన ఓబయ్య

కంబదూరులోని ఓబయ్య సమాధి



కళ్యాణదుర్గం: తెల్లదొరల పాలిట సింహస్వప్నమై ఈడిగ ఓబయ్య సాగించిన స్వాతంత్ర్య సంగ్రామం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఇండియా ఓబయ్యగా ఖ్యాతిగాంచిన ఆయన కళ్యాణదుర్గం ప్రాంతానికి ఓ దిక్సూచిగా చెరగని ముద్ర వేసుకున్నారు. 1918, జూలై 17న సామాన్య వ్యవసాయ కుటుంబంలో పాపన్న, లింగమ్మ దంపతులకు ఆయన జన్మించారు. సొంతూరు కంబదూరులోనే పాఠశాల చదువు పూర్తి చేసి 1935లో టీచర్ ట్రైనింగ్‌కు హాజరై 1937లో పూర్తి చేశారు. అదే సమయంలో హరిజనులు చదువుకోవాలన్న ఉద్దేశ్యంతో కంబదూరులో 70 మంది హరిజన కుటుంబాలను కలిపి ఓ పాఠశాలను ప్రారంభించారు. అప్పట్లోనే పెనుకొండ కేంద్రంగా నీలం సంజీవరెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన యువజన సంఘం స్ఫూర్తితో వ్యక్తి సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొన్నారు. గాంధీజీ అడుగు జాడల్లో నడుస్తూ వందల సంఖ్యలో యువకుల్లో దేశ భక్తిని రగిలించారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలి స్వాతంత్ర్య ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూ తన ఉపన్యాసాలతో యువతను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో జైలు జీవితాన్ని అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా యువజనులను సమీకరించి కొండల్లో సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న బ్రిటీష్ ప్రభుత్వం ఓబయ్యపై కన్నెర్ర చేసింది. దీంతో కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాలతో కొంత కాలం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. స్వాతంత్ర్యోద్యమంలో ఓబయ్య అరెస్ట్‌తో మూతపడిన హరిజన పాఠశాల ఫర్నీచర్‌ను తిమ్మాపురానికి తరలించి అక్కడ సేవామందిరాన్ని ఏర్పాటు చేశారు. 1972–78 మధ్య కాలంలో ఓబయ్య ఎమ్మెల్సీగా పనిచేశారు. అంతకు ముందు ఆర్డీఓ అధ్యక్షతన ఏర్పాటైన సమితి ఉపాధ్యక్షుడిగా, కంబదూరు సమితి అధ్యక్షుడిగా, మరో ఐదేళ్లు కంబదూరు సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. కళ్యాణదుర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో అసెంబ్లీ ఎన్నికల్లో పప్పూరు రామాచార్యులు, సందా నారాయణప్ప, శాంతప్ప, హిందీ నరసప్ప, టీసీ మారెప్ప, లక్ష్మీదేవి తదితర తన అనుచరులు, సహచరులను ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారు. ప్రజా సేవలోనే ఢిల్లీలో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు.



ప్రమాదకర విన్యాసాలకు సిద్ధమవుతున్న పోలీసు జాగిలం



గౌరవ వందన సమర్పణను సాధన చేస్తున్న దృశ్యం

సన్నాహకం.. సంబరం

స్వాతంత్ర్య దినం సందర్భంగా గురువారం నిర్వహించే వేడుకలు జయప్రదం చేసేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. ఈ క్రమంలో అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పరేడ్‌కు సంబంధించి బుధవారం నిర్వహించిన రిహార్సల్ ఆకట్టుకుంది. పోలీసు జాగిలాల విన్యాసాలు అబ్బురపరిచాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మార్చ్ ఫాస్ట్ రిహార్సల్‌లో పాల్గొన్న సాయుధ బలగాలు

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

గార్లదిన్నె: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. వివరాలు... కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన సురేంద్రకు గార్లదిన్నెకు చెందిన యువతితో వివాహమైంది. కొంతకాలంగా భర్త వేధిస్తుండడంతో విసుగు చెందిన ఆమె పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం భార్యను కాపురానికి పిలుచుకెళ్లేందుకు వచ్చిన సురేంద్ర... ఆ సమయంలో మూడేళ్ల వయసున్న కుమార్తెతో అనుచితంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని గుర్తించిన ఆమె వెంటనే సోమవారం డీపీఓకు చేరుకుని ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నుంచి రెఫరల్ అందుకున్న గార్లదిన్నె పోలీసులు విచారణ అనంతరం మంగళవారం ఉదయం సురేంద్రను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి హత్య



హతుడు తిప్పేస్వామి

కంబదూరు: వివాహేతర సంబంధం ఓ వ్యక్తిని బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం రాళ్లపల్లికి చెందిన తిప్పేస్వామి (40)కి ఐపార్సుపల్లికి చెందిన సుశీలమ్మతో పదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి తర్వాత ఐపార్సుపల్లిలోనే తిప్పేస్వామి స్థిరపడ్డాడు. ఈ క్రమంలో కొన్నేళ్లుగా కదిరిదేవరపల్లికి చెందిన సాకమ్మతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. విషయం తెలుసుకున్న సాకమ్మ సంబంధీకులు పలుమార్లు తిప్పేస్వామిని మందలించారు. అయినా అతనిలో మార్పు రాలేదు. దీంతో కక్ష పెంచుకున్న సాకమ్మ మరిది రాజు, నరేష్ సోమవారం రాత్రి కంబదూరు నుంచి రాళ్లపల్లికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న తిప్పేస్వామిని కంబదూరు శివారులోనే చాకిరేవు వద్ద అడ్డుకుని బండరాయితో తలపై మోది ఉడాయించారు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న తిప్పేస్వామిని అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి అతను మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

నిందితుల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: తిప్పేస్వామి హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు గల కారణాలను కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవిబాబు, సీఐ ఎన్.వి.నాగరాజు వెల్లడించారు. తిప్పేస్వామిని కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన హరిజన రాజు, హరిజన నరేష్ హతమార్చినట్లు తెలిపారు. తమ బంధువైన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే కారణంతోనే ఈ దారుణానికి ఒడిగట్టారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం మధ్యాహ్నం కంబదూరు మండలం రాళ్లపల్లి గ్రామం వద్ద నిందితుల్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారన్నారు.

విద్యార్థి అదృశ్యం



మనోజ్‌కుమార్

గుత్తి: స్థానిక బ్రాహ్మణవీధిలో నివాసముంటున్న కుళ్లాయిస్వామి, చౌడమ్మ దంపతుల కుమారుడు మనోజ్‌కుమార్ కనిపించకుండా పోయాడు. గుత్తి కోట పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మనోజ్‌కుమార్... సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మంగళవారం ఉదయం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రబోధానంద ఆశ్రమంలో భక్తుడి ఆత్మహత్య

- ఐదేళ్ల క్రితం కుటుంబానికి దూరమైన యువకుడు

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్నపోలమడ వద్ద ఉన్న ప్రబోధానంద ఆశ్రమంలో ఓ భక్తుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంటూరు జిల్లాకు చెందిన శ్రీకాంత్ (27) ఐదేళ్ల క్రితం ప్రబోధానంద శిష్యునిగా ఉంటూ కుటుంబ సభ్యులకు దూరమయ్యాడు. ఈ క్రమంలోనే ఆశ్రమంలోనే ఉంటూ ప్రింటింగ్ సెక్షన్‌లో పనిచేసేవాడు. అదే ఆశ్రమంలో కుటుంబ సభ్యులతో కలసి ఉంటున్న కర్నూలు జిల్లా జొన్నగిరి మండలం ఎర్రగుడికి చెందిన మన్విత తాడిపత్రి మండలం వంగనూరులో ఆశ్రమానికి చెందిన పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఆమెతో ఏర్పడిన పరిచయం కారణంగా శ్రీకాంత్‌కు మన్వితను ఇచ్చి ఆమె కుటుంబసభ్యులు పెళ్లి జరిపించారు. పెళ్లి అనంతరం ఆశ్రమానికి చెందిన గదిలోనే కాపురముంటూ వచ్చారు. కొంత కాలంగా వెన్ను నొప్పితో బాధపడుతున్న శ్రీకాంత్.. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మన్విత ఆశ్రమ పాఠశాలకు వెళ్లిపోయిన తర్వాత తన గదిలోకి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గది తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మన్విత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం



రైతు కంబగిరిస్వామిని అనంతపురానికి తరలిస్తున్న దృశ్యం

యాడికి: భూ తగాదా పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెంది ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల సమక్షంలోనే క్రిమి సంహారక మందు తాగాడు. వివరాలు... యాడికి మండలం వీరన్నపల్లికి చెందిన రైతు కంబగిరి స్వామికి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 273–1లో పూర్వీకుల నుంచి వారసత్వంగా 4 ఎకరాల భూమి వచ్చింది. ఈ భూమిలో కంది, సజ్జ సాగు చేపట్టాడు. అయితే అదే భూమిలో తమకు రెండు ఎకరాలు రావాలని కంబగిరి స్వామి పెద్దనాన్న కుమారులు కంబగిరి, రమేష్ పట్టుబట్టారు. ఈ క్రమంలో కంబగిరిస్వామి సాగు చేసిన కంది, సజ్జ పంటను వారం రోజుల క్రితం తొలగించారు. ఈ దౌర్జన్యంపై పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం ఇరు వర్గాల రైతులను పోలీసులు పిలిపించి, వారి వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించి, కేసు నమోదు చేశారు. అయితే భూ సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. దీంతో మనస్తాపం చెందిన కంబగిరి స్వామి పోలీసులు చూస్తుండగానే క్రిమి సంహారక మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న బాధితుడిని పోలీసులు వెంటనే యాడికి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయండి

కూడేరు: క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి కౌలు రైతులను గుర్తించాలని, ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మంగళవారం ఆమె కూడేరులోని వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ-క్రాప్ నమోదు గురించి ఏఈఓ శైలజాను అడిగి తెలుసుకున్నారు. ఈ-క్రాప్ నమోదులో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా 50 ఎకరాల విస్తీర్ణంలో గంధం, టేకు మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా నిర్దేశించినట్లు గుర్తు చేశారు. రైతు పొలాల గట్లపై వీటిని నాటించాలని సూచించారు.

విద్యార్థిని బలవన్మరణం



మృతురాలు అక్షయ

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన అక్షయ (17) రెండేళ్ల వయసులో ఉన్నప్పుడే తల్లి నాగవేణి వదిలి వెళ్లిపోయింది. తండ్రి అనిల్‌కుమార్ రెడ్డి ప్రస్తుతం అనంతపురంలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నప్పటి నుంచి తన అమ్మమ్మ ప్రభావతి, తాత గోవిందరెడ్డి వద్దనే అక్షయ పెరిగింది. అనంతపురంలోని మాస్టర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆమె ఇటీవల ఇంటికి వచ్చింది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయ బోర్లు ధ్వంసం

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రామాంజనేయులు, నారాయణస్వామికు చెందిన వ్యవసాయ బోర్లను దుండగులు ధ్వంసం చేశారు. తనకున్న పది ఎకరాల్లో రెండున్నర ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. సోమవారం పొలం పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న వారు... మంగళవారం ఉదయం తిరిగి పొలానికి వెళ్లారు. అప్పటికే బోరుబావులను దుండగులు ధ్వంసం చేశారు. ఘటనతో దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.





ధ్వంసం చేసిన బోరును చూపుతున్న బాధిత రైతులు నారాయణస్వామి, రామాంజనేయులు

క్లుప్తంగా

మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ సుచరిత

ఆత్మకూరు: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలియజేశారు. మంగళవారం పంపనూరు సమీపంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, సిబ్బంది వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు తెలియజేశారు. వేరుశనగలో జిగురు అట్టలలను ఎకరాకు 10 నుంచి 15 వరకు పెట్టుకుంటే రసం పీల్చే పురుగులతో పాటు మొవ్వు కుళ్లు వైరస్‌ని నివారించవచ్చన్నారు. ఎకరాకు 200 కిలోల జిప్సమ్ వాడటం ద్వారా కాయ నాణ్యత, నూనె శాతం పెరుగుదల ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం పంటలకు మందులు పిచికారీలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేష్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న మల్లేష్

అనంతపురం కల్చరల్: సామాజిక సేవా కార్యకర్త సాకే మల్లేష్ జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అనంతకు చెందిన మల్లేష్ ప్రజా అభ్యుదయ ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ కో ఆపరేటివ్ సొసైటీని ప్రారంభించి దశాబ్దానికి పైగా సేవలందిస్తున్నాడు. గ్రామాలను దత్తత తీసుకుని వాటి అభివృద్ధి కోసం శ్రమిస్తున్నాడు. ఈ నేపథ్యంలో డాక్టరేట్‌కు ఎంపికైన మల్లేష్ మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు సామాజిక సేవకుగాను గౌరవ డాక్టరేట్ అందించారు.

కర్ణాటక మద్యం రవాణాపై నిఘా పెంచండి

- సెబ్ స్టేషన్ తనిఖీ చేసిన సెబ్ డిప్యూటీ కమిషనర్



సెబ్ స్టేషన్‌లో కేసుల వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్

చెన్నేకొత్తపల్లి: కర్ణాటక మద్యం సరఫరా కాకుండా గట్టి నిఘా ఉంచాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలను సెబ్ సీఐ లలితా దేవితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు, మద్యంను పరిశీలించారు. ఎస్ఐ శివ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



ఎమ్మెల్యే సునీతకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కనగానపల్లి: ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మండల స్థాయి అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. భూ సమస్యలతో పాటు పింఛన్లు, రేషన్‌కార్డులు కావాలంటూ పలువురు వినతులు అందజేశారు. వీటితో పాటు తమ సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడాలని మండల సమగ్రశిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులను క్షుణంగా పరిశీలించి సకాలంలో వాటికి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆకుపూజ, నిర్వహించి పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథునికి రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రోడ్డు.. మోకాలడ్డు!

- తెలుగుదేశం ప్రభుత్వంలో పెరుగుతున్న రోడ్డు వివాదాలు
- నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు
- నష్టపరిహారం కోసం పాకులాట



40 ఏళ్ల నుంచి ఉన్న రోడ్డును మూసివేశారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ సాకే చంద్ర, స్థానికులు



33వ డివిజన్ కృపానంద నగర్‌లో రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టి

అనంతపురం కార్పొరేషన్: తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన అనతికాలంలోనే నగరంలో రోడ్డు వివాదాలు రోజుకొకటి బయటకొస్తున్నాయి. ఆ స్థలం తమదని, వాటి జోలికి వెళ్లకూడదంటూ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు టీడీపీ నాయకులకు వత్తాసు పలకడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. 40 నుంచి 50 ఏళ్ల క్రితం నాటి స్థలాలు తమవంటూ నష్టపరిహారం చెల్లించాలని నగరపాలక సంస్థ అధికారుల చుట్టూ కొందరు తిరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న రేటు ప్రకారం ఆ స్థలాలకు నష్టపరిహారం చెల్లించాలంటే రూ.కోట్లు అవుతుంది.

కృపానందనగర్‌లో..

1996లో మునిసిపల్ చైర్మన్‌గా ప్రభాకర్ చౌదరి ఉన్న సమయంలో కృపానందనగర్‌లో సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు కొందరు టీడీపీకి చెందిన నాయకులు సీసీ రోడ్డు స్థలం(ఆరు సెంట్లు) తమకు చెందుతుందని చెబుతూ రోడ్డును మూసివేశారు. ఇదే విషయపై స్థానిక కార్పొరేటర్ సాకే చంద్ర టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎటువంటి స్పందన లేదు. చివరకు మాజీ మంత్రి తమ్ముడు ఈ విషయంపై ఫోన్ చేశారని, రెండ్రోజులు ఆగితే తీసేస్తామని చెప్పారు. ఇక టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి ఇంటికి కూతవేటు దూరంలో ఇలా రోడ్డు వివాదం ఉన్నా..పట్టీ పట్టనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో..

నగరంలోని సాయినగర్‌లోనూ టీడీపీ సానుభూతిపరులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు మూసివేసి గోడ నిర్మించారు. అక్కడి ప్రజలు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకు గోడ తొలగించారు. ఎర్రనేలకొట్టాలకు వెళ్లే మార్గంలోనూ ఓ ప్రైవేట్ స్థలంలో పైపులు వెళ్లాయంటూ స్థల యజమానులు బ్రిడ్జికి అడ్డుగా మట్టిదిబ్బలు వేశారు. వినాయకగనర్‌లోనూ కొందరు వ్యక్తులు స్థలం తమదంటూ కాలువ మూసేశారు. కోవూర్‌నగర్‌లోనే కొందరు తమ స్థలమంటూ నగరపాలక సంస్థ అధికారులను సంప్రదించారు. ఇటీవల కాలంలో నగరంలో ఇటువంటి సమస్యలు తెరపైకి వస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తుగా స్పందిస్తే ఎటువంటి సమస్య ఉండదు.

విచిత్రంగా ఉంది

> ఇటీవల కొంతమంది తమ స్థలంలో రోడ్డు నిర్మించారని, కాలువలు ఏర్పాటు చేశారని ఫిర్యాదులు చేస్తున్నారు. ఇది విచిత్రంగా ఉంది. తమ స్థలానికి నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఎవరు వచ్చినా..దీనిపై సమగ్ర విచారణ చేసి, ప్రభుత్వానికి లేఖ పంపుతాం. అక్కడి నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటాం.
>
> – మారుతీహరిప్రసాద్ ఏసీపీ, నగరపాలకసంస్థ

ఉరుసు ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఉరవకొండలో ఈ నెల 28న జరిగే ఉరుసు ఆహ్వాన పత్రికను మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం ముస్లిం మైనార్టీ పెద్దలు మాజీ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉరుసుకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మత పెద్దలు పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

అనంతపురం కల్చరల్: రాయదుర్గం మండలం చదం గ్రామంలో వెలసిన ప్రాచీన చతుర్ముఖ క్షేత్రమైన శివాలయంలో నంది విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఏఎల్ఎన్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి సంకేపల్లి సత్యనారాయణ శర్మ, మారుతీ నరసింహం, చంద్రకాంత్, దాక్షాయణి, విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సంఘటనను సుమోటా తీసుకొని సత్వరమే విచారణ చేపట్టాలన్నారు. నంది విగ్రహానికి తల లేకుండా చేసిన వారు ఎంతటి వారైనా వదలొద్దన్నారు. నిందితులకు శిక్ష పడకుంటే భవిష్యత్తులో మరిన్ని దారుణాలు జరిగే అవకాశముందని ఆందోళన వెలిబుచ్చారు. ఆలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాప్తాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

అనంతపురం అర్బన్: స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దామని, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుదాంటూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు, విద్యార్థులు నినదించారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ నుంచి జెడ్పీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు 78 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం డీఎస్పీ ప్రతాప్ హాజరై విద్యార్థులతో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నేత సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

రాప్తాడు: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయుల త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుదామని ఎంపీడీఓ సాల్మన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తిని అలవర్చుకోవాలని అవినీతిని అంతమొందించేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. మండల ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సర్పంచు సాకే తిరుపాలు, మండల కన్వీనర్ పంపు కొండప్ప, హెచ్ఎం సాంబశివ, స్కూల్ కమిటీ చైర్మన్ గంజి లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవుని ఆజ్ఞలు జ్ఞాపకం చేయాలి

- పాస్టర్ కె.పరిశుద్ధరావు



మాట్లాడుతున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నెహమ్యా నాగరాజు

రాప్తాడురూరల్: దేవుని ఆజ్ఞలను జ్ఞాపకం చేయు వ్యక్తిగా ప్రతి ఒక్కరూ ఉండాలని గుంటూరు కర్మేలు గాస్పల్ మినిస్ట్రీస్ పాస్టర్ కె.పరిశుద్ధరావు కోరారు. అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 50వ సర్వసభ్య సమావేశం మంగళవారం అనంతపురం రూరల్ బళ్లారి రోడ్డులోని హోసన్నా హోలీ గాడ్ చర్చిలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి పాస్టర్ పరిశుద్ధరావు మాట్లాడుతూ దైవ సేవకుడు ఆత్మీయ ఆహారం పంచిపెట్టే వ్యక్తిగా ఉండాలన్నారు. లోకమునకు పునరుద్ధానపు వాసనగా జీవపు వాసనగా ఉండాలని కోరారు. సమావేశంలో పాస్టర్ జహంగీర్ జాషువా, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పీ. మార్కు, గౌరవ అధ్యక్షులు బందెల రాజు, డాక్టర్ ఎలీయెజెర్, సెక్రటరీ పాస్టర్ జీఆర్ ఆనంద్, ట్రెజరర్ పాస్టర్ కె. జీవన్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్ రూఫస్ కుమార్, పాస్టర్ శాంత వర్ధన్, పాస్టర్ జహంగీర్ జాషువా, పాస్టర్ లాబాను సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21 మంది పాస్టర్స్‌కు ఆర్థికసాయం అందించారు.

బోసిపోయిన జెడ్పీ కార్యాలయం

- అందుబాటులో లేని సిబ్బంది
- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సీరియస్



జెడ్పీలోని 'ఎ' సెక్షన్‌లో ఉద్యోగిని శిరీషతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: 'ఇది కార్యాలయం అనుకున్నారా, బందెలదొడ్డి అనుకున్నారా? ఎప్పుడుబడితే అప్పుడు రావడానికి, ఎప్పుడుబడితే అప్పుడు వెళ్లడానికి? అసలు ఎటువంటి సెలవు చీటీలు లేకుండా, రిజిస్టర్‌లో నమోదు చేయకుండా ఉద్యోగులు సెలవులో ఎలా వెళ్తారని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నిలదీశారు. మంగళవారం సాయంత్రం ఆమె కార్యాలయంలోని అన్ని సెక్షన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం 80 నుంచి 90 మంది ఉద్యోగులు పని చేస్తుండగా.. కేవలం 15 నుంచి 25 మంది ఉద్యోగులు అందుబాటులో ఉండడం చూసి ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఏ సెక్షన్‌కు వెళ్లి అడిగినా సెలవులో వెళ్లారంటూ ఉద్యోగులు సమాధానం ఇచ్చారు. రిజిస్టర్‌ను పరిశీలించగా అందులో ఏ ఒక్కరి సెలవు నమోదు చేయకపోగా, కనీసం సెలవు చీటి రాసి పెట్టకపోవడం పై కనిపించింది. డిప్యూటీ సీఈఓకు దగ్గరగా ఉండే కొందరు ఉద్యోగులకు సంబంధించిన సెలవు చీటీలు అప్పటికప్పుడు తెప్పించి రిజిస్టర్‌లో నమోదు చేయడంపై చైర్‌పర్సన్ కోపోద్రిక్తులయ్యారు. ఇది మీ ఇల్లనుకుంటున్నారా? అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు చేసుకుంటామంటే కుదురదంటూ తేల్చిచెప్పారు. ఇలాగైతే పరిపాలన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అయితే డిప్యూటీ సీఈఓ మాత్రం తాను ఎవరికీ సెలవులు ఇవ్వలేదని, ఇన్‌చార్జ్ సీఈఓను అడగాలని చెప్పగా.. చైర్‌పర్సన్ మరింత ఆగ్రహోదగ్రులయ్యారు. పాలనలో కీలక పాత్రం డిప్యూటీ సీఈఓకే ఎక్కువగా ఉంటుందని, ఉద్యోగుల సెలవుల మంజూరు డిప్యూటీ సీఈఓనే చూస్తారని, మీరేంటి ఇలా మాట్లాడుతారని నిలదీయగా.. మౌనమే ఆమె సమాధానమైంది. తర్వాత కొందరు ఉద్యోగులు చైర్‌పర్సన్‌ను కలసి తప్పైపోయిందని, ఇక మీదట అనుమతి లేకుండా వెళ్లమంటూ చెప్పుకొచ్చారు. 'మీ వల్ల ఇప్పటికే జెడ్పీలో పాలన గాడి తప్పిందని, ఉద్యోగుల ఇష్టారాజ్యమైపోయిందని, ఇటువంటి విపరీత పోకడలను సహించేది లేదని స్పష్టంగా చైర్‌పర్సన్ చెప్పారు.

చరిత్రపై విద్యార్థులకు అవగాహన

అనంతపురం కల్చరల్: అలనాటి జాతీయ నాయకుల త్యాగాలు, సాహసోపేతమైన ఉద్యమ చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీరాం కుమార్ అన్నారు. స్వాతంత్య్రదినోత్సవంలో భాగంగా మంగళవారం ఇంటాక్, పురావస్తుశాఖ, పర్యాటకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. త్రివర్ణ పతాకాలను చేతబట్టి భరత మాతను కీర్తిస్తూ ర్యాలీ సాగింది. అనంతరం కల్లూరు సుబ్బారావు పురావస్తు శాఖ ప్రదర్శనశాలలో జాతీయోద్యమం అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అధికారులు వెంకటేశ్వర్లు, రజిత, ఇంటాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి సిబ్బందికి సూచించారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన రెండు మాతృ, 19 శిశు మరణాలపై సంబంధిత వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ హైరిస్క్ గర్భవతుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా చూడాలన్నారు. మృతికి గల కారణాలను తెలుసుకుని భవిష్యత్తులో అలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డీఐఓ డాక్టర్ యుగంధర్, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

'ఇన్‌పుట్ సబ్సిడీ' చేతికందేనా!

- మిస్ మ్యాచింగ్‌తో 846 మందికి అందని పరిహారం
- అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు

ఆత్మకూరు: గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మిస్ మ్యాచింగ్ జాబితాలో ఉన్న రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎదురుచూస్తున్నారు. రెండు నెలలైనా కూటమి ప్రభుత్వం ఈ విషయం గురించి పట్టించుకోకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే....గతేడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటలను వ్యవసాయ సిబ్బంది ఈ క్రాప్ బుకింగ్ చేశారు. పంట నష్టపోతే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించే సమయంలో ఎన్నికల కోడ్ ఉన్నది ఎలా ఇస్తారు ? అంటూ అప్పటి కూటమి నాయకులు గతంలో కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికల కోడ్ ముగియగానే ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికలు ముగిసిన వెంటనే రైతులకు ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ నగదు జమ చేసింది. అయితే వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో కొంత మంది రైతులకు సంబంధించి బ్యాంక్ ఖాతా నంబర్లు, ఆధార్ నంబర్లు తప్పు పడటంతో ఇన్‌పుట్ సబ్సిడీ జమకాలేదు.

జిరాక్సులు తీసుకున్నా..

మండల వ్యాప్తంగా 2023కు సంబంధించి 6575 హెక్టార్ల పంటల సాగుకుగాను మొత్తం 5507 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందాలి. అయితే ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్లు మిస్ మ్యాచ్ అవ్వడంతో మండల వ్యాప్తంగా 846 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు. ఇందుకు సంబంధించి వ్యవసాయ సిబ్బంది ఇప్పటికే రైతుల దగ్గర నుంచి జిరాక్సులు తీసుకున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి సుచరితను వివరణ కోరగా మిస్‌మ్యాచ్ అయిన రైతుల వివరాలను సేకరించామని ఆ జాబితాను ఉన్నత అధికారులకు పంపించామన్నారు. మిస్ మ్యాచింగ్‌లో రాని రైతులకు తప్పకుండా ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం అందుతుందని చెబుతున్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రమా సౌమ్య

రాప్తాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా అబ్జర్వర్, శ్రీకాళహస్తి ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రమా సౌమ్య అన్నారు. ఆమె గురువారం ప్రసన్నాయపల్లి చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద జరుగుతున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. గ్రామాలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఎరువులను తయారు చేయాలన్నారు. గ్రామ ప్రథమ పౌరుడి బాధ్యతలను సర్పంచులు సమర్థవంతంగా నిర్వహించాలని, గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించి మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటుగా ఆర్థిక సంఘం, పంచాయతీ నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. అనంతరం చెత్తతో సంపద ఎలా తయారు చేయాలో వివరించారు. ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, రిపోర్స్ పర్సన్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లపై గోతులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు



కొత్త కెనరా బ్యాంక్ ఎదురుగా ప్రమాదకరంగా గుంత

ఆత్మకూరు: ఆత్మకూరు రహదారుల్లో ప్రమాదకరంగా గుంతలు ఏర్పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆత్మకూరు బస్టాండ్ కు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ప్రస్తుతం ఆ ప్రధాన రహదారి మధ్యలో డ్రైనేజీ పైప్‌లైన్ వెళ్లింది. ఆ డ్రైనేజీ మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, వృద్ధులు, చిన్నారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలో చాలా రోజులుగా పైప్‌లైన్ల కోసం గుంత తవ్వి పూడ్చకపోవడంతో పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుచున్నారు.

ప్రభాకర్ జీ స్కూల్‌లో ప్రహరీ తొలగింపు

- హెచ్ఎం ఉమాదేవి, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య వాగ్వాదం



నాడు-నేడు కింద నిర్మించిన గోడను తొలగించిన దృశ్యం



అనధికారింగా ఏర్పాటు చేసిన గోడను తొలగిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ప్రభాకర్ జీ నగరపాలక ప్రైమరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన ప్రహరీ తొలగింపు తీవ్ర వివాదానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న ఏసీపీ మారుతీహరిప్రసాద్, ఈఈ సూర్యనారాయణ, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి మంగళవారం స్కూల్ వద్దకు చేరుకుని తమ అనుమతి లేకుండా ప్రహరీని ఎందుకు కూల్చారని హెచ్ఎం ఉమాదేవిని ప్రశ్నించారు. దీంతో కాసేపు హెచ్ఎం, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తర్వాత ప్రహరీ తొలగింపు పనులు నిలుపుదల చేయించారు. పాఠశాలలో మరోవైపు అనుమతి లేకుండా నిర్మిస్తున్న గోడపై హెచ్ఎంను ప్రశ్నించారు. గత కమిషనర్ మేఘస్వరూప్‌తో అనుమతులు తీసుకున్నట్లు హెచ్ఎం వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడం సరికాదని ఏసీపీ ఆదేశాలతో అనధికారికంగా నిర్మించిన గోడను తొలగించారు.

ఎమ్మెల్యే ఇంట్లో పంచాయితీ

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్య ఏర్పడితే సంబంధిత డీఈఓ, నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ హెచ్ఎం ఉమాదేవి నేరుగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఇంటికి వెళ్లి గోడను తొలగించారంటూ అధికారులపై ఫిర్యాదు చేశారు. నాడు-నేడు కింద 2021 ఏర్పాటు చేసిన ప్రహరీని నగరపాలక సంస్థ అధికారులే తొలగించారని ఫిర్యాదు చేసినట్లు తెల్సింది. ఏసీపీ మారుతీప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఈఈ సూర్యనారాయణను ఎమ్మెల్యే పిలిపించి సమస్యను తెలుసుకున్నారు. దీంతో సమస్య సద్దుమణిగింది. ఇదెలా ఉన్నా..ప్రస్తుతం నాడు-నేడు కింద చేపట్టిన ప్రహరీని ఏర్పాటు చేయాలంటే రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ మొత్తాన్ని నగరపాలక సంస్థ భరిస్తుందా లేక హెచ్ఎం ఉమాదేవి ఖాతా నుంచి వసూలు చేస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.